ప్రజాశక్తి

శనివారం 20 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పొలాల్లోకి వాననీరు



చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద పొలాల్లోకి చేరిన నీరు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరుగా, మరికొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో పొలాల్లోకి నీరు చేరింది. డెల్టాలో వెద పద్ధతిలోసాగు చేసిన వరి పొలాల్లోకి నీరు చేరడం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు తగ్గి నీరు బయటకు పోతే పైరు త్వరగా నిలదొక్కుకుంటుందని రైతులు చెబుతున్నారు.

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోకి నీరు రావడంతో రైతులు నీటిని బయటకు పంపేందుకు తిప్పలుపడుతున్నారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు పలుచోట్ల చెరువులకు జలకళ సంతరించుకుంది. దుగ్గిరాలలో అత్యధికంగా 34.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 20.9 మిల్లీ మీటర్లసగటు వర్షంపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 17.2 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో కూడా దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురిసింది.

చాలా కాలంగా చాలీ చాలని వర్షంతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మెట్ట భూముల్లో వెంటనే పత్తి, అపరాల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. రోడ్లపై వర్షం నీరు, మురుగునీరు కలిసి పారడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలకు గ్రామీణ రోడ్లు అధ్వానంగామారాయి. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వరి సాగుకు ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు పత్తి, అపరాలు, పసుపు వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. సాగర్ జలాశయంలోకి పూర్తి స్థాయిలో నీరు వస్తేనే మిర్చిసాగుకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందంటున్నారు.

గుంటూరు జిల్లాలో జూన్‌లో మొత్తం 97.1 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదు కావాల్సిఉండగా 160.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జులైలో 164.9 మిల్లీ మీటర్లు వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికే 160.2 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో జూన్‌లో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా నెల మొత్తం మీద

▶ 2లో



రషీద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

రషీద్ కుటుంబానికి జగన్ ఓదార్పు

ప్రజాశక్తి - వినుకొండ

హత్యకు గురైన వైసిపి కార్యకర్త షేక్ రషీద్ కుటుంబాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. వారితో దాదాపు 20 నిమిషాలు గడిపారు. జగన్‌ను చూడగానే రషీద్ తల్లి, తండ్రి, ఇతర సభ్యులు బోరున విలపించారు. ఘటన జరిగిన తీరును వివరించారు. వారి చేతులు పట్టుకుని చాలా సేపు జగన్ ఓదార్చారు. తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండలని భరోసా ఇచ్చారు. మీ పార్టీ కోసమే మా అబ్బాయి రషీద్ ప్రాణాలు కోల్పోయాడని మృతుడి తల్లి మాజీ జగన్మోహన్‌రెడ్డి వద్ద కన్నీరు పెట్టుకున్నారు. తన కుమారుడిని చంపిన హంతకులను రోడ్డుపై ఉరితీయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ దోషులకు శిక్ష పడేంత వరకు పోరాడుతామన్నారు. పోలీసులు న్యాయం చేయకపోతే న్యాయస్థానానికి వెళ్లి పోరాటం చేద్దామని భరోసాని ఇచ్చారు.

జగన్ వినుకొండ పర్యటన పురస్కరించుకుని పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. 144

▶ 2లో



చిరుద్యోగులపై వేధింపులు, తొలగింపులు ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక చిరుద్యోగులపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని, తక్షణమే వాటిని ఆపేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి కూటమి గెలుపులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు ముఖ్యపాత్ర పోషించారన్నారు. కానీ వారి కోసం అనుకూలంగా ఇంత వరకూ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదన్నారు. మంత్రివర్గ ప్రమాణ స్వీకారం కూడా కాకుముందే ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొంత మంది అంగన్‌వాడీలపై నిర్బంధాలకు పాల్పడుతున్నారని, రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారన్నారు. యానిమేటర్లను తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు స్వయంగా పోలీసులను వెంటబెట్టుకొని గ్రామాలకు వెళ్లి డ్వాక్రా మహిళలతో బలవంతంగా సంతకాలు చేయించి యానిమేటర్లను తొలగించినట్లు తీర్మానాలు రాస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలన్నీ చట్టవ్యతిరేకమైనవని, వీటన్నిటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ 'ప్రజాగళం' మానిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగులు, చిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరికీ సిఐటియు ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రాలు అందించబోతున్నామన్నారు. అప్పటికీ వేధింపులు ఆపకపోతే ఉద్యోగాలు, హక్కులు నిలబెట్టుకునేందుకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో చిరుద్యోగులు చేసే పోరాటాలకు సిఐటియు ప్రత్యక్షంగా మద్ధతు ఇస్తుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గంగాధరరావు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ ఛాన్సలర్‌గా అవకాశం ఇచ్చిన సిఎం చంద్రబాబుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తానపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వర్సిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వర్సిటీ అధికారులు, ఉద్యోగుల, అధ్యాపకుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధిని రెట్టింపు చేస్తానన్నారు. విద్యా విషయక, పరిశోధన, బోధన రంగాలను బలోపేతం చేసి యూనివర్సిటీ స్థాయిని పెంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కృషి విజ్ఞాన కేంద్రానికి స్థలం ఎక్కడైనా ఇస్తాం 8లో

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

మంగళగిరి, తాడేపల్లిలో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-మంగళగిరి, తాడేపల్లి



తాడేపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి పొట్లాలు

గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఆరుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి ఐదు కిలోలకు పైగా సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను మంగళగిరి పట్టణ సిఐ డి.వినోద్‌కుమార్, తాడేపల్లి సిఐ కల్యాణరాజు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. మంగళగిరి పట్టణ శివారు ఎర్రబాలేనికి చెందిన మాకిన అమర్నాథ్, కామినేని సాయికృష్ణ, చింతల హరీష్ గంజాయిని విశాఖ ప్రాంతం నుండి తెచ్చి స్థానిక ఎయిమ్స్ ఆసుపత్రి సమీపంలో విక్రయిస్తుండగా నార్త్ సబ్ డివిజన్ డిఎస్‌పి సిహెచ్.రవికాంత్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి 3.5 కిలోల సరుకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తాడేపల్లి పట్టణం సీతానగరం రైల్వే బ్రిడ్జి సమీపంలో సుందరయ్య నగర్‌కు చెందిన బండిరెడ్డి నందు, అవదూతల భార్గవ్, మహానాడుకు చెందిన బండిరెడ్డి అఖిల్ చేతిలో సంచి పట్టుకుని తిరుగుతున్నారు. వీరు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని 1.6 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేయగా మద్యం, గంజాయి చెడు వ్యసనాలకు అలవాటు పడి తేలిక మార్గంలో డబ్బు సంపాదించాలని గంజాయి అమ్మకానికి అలవాటు పడినట్లు చెప్పారు. విజయవాడ, మంగళగిరి, తాడేపల్లిలోని కృష్ణా కెనాల్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించే అలవాటు ఉన్న వారిని గుర్తించి అమ్మకాలు సాగిస్తున్నట్లు నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేస్తున్న నాయకులు

రేపు రజక వృత్తిదార్ల సంఘం మహాసభ

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం జరగనున్న ఎపి రజకవృత్తిదారుల సంఘం మంగళగిరి-తాడేపల్లి నగర మహాసభను జయప్రదం చేయాలని సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి సుబ్బారావు కోరారు. ఈ మేరకు పట్టణంలోని అపార్టుమెంట్ల వాచ్‌మెన్, ఇస్త్రీదారులకు వివిధ అపార్టుమెంట్లలో శుక్రవారం కరపత్రాల ప్రచారం చేశారు. సుందరయ్యనగర్, ఇప్పటం, ఎర్రబాలెం, పెనుమాక, ఉండవల్లి సెంటర్‌లోని రజక కుటుంబ సభ్యులను కలిసి కరపత్రాలు అందజేసి మహాసభకు తరలిరావాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, డి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

బస్సు సదుపాయం కోసం డయల్ యువర్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసీ బస్టాండ్‌లోని గుంటూరు-2 డిపో మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలాం ఫోన్‌ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. వంగిపురానికి చెందిన నాగులమీరా గుంటూరు నుండి వంగిపురాని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణ స్పెషల్ సర్వీసుల్లో మంత్లీ సీజన్ పాస్‌లు అనుమతించట్లేదని, స్త్రీలకు కేటాయించిన సీట్లను వారికే కేటాయించాలని కోరారు. గుంటూరు నగరంలో సిటీ బస్సులు నడపాలని శ్రీనివాసరావు కోరారు. ముట్లురుకు చెందిన జయపాల్ గుంటూరు నుండి ముట్లురుకు కేటాయించిన సమయానికి బస్సులు రావట్లేదని, సమయం ప్రకారము బస్సులు నడపాలని కోరారు.

ఊపిరితిత్తుల సమస్యలపై 21న ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) అసిస్టెంట్ ప్రొఫెసర్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వెంకట కళ్యాణ్ ప్రధాన వక్తగా పాల్గొని ఊపిరితిత్తులు, శ్వాశకోస సమస్యలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఇటీవల పెరిగిపోతున్న డయేరియా, డెంగీ, మలేరియా, ఎల్లో ఫీవర్ లాంటి సీజనల్ వ్యాధులపై, న్యూమోనియా, ఉబ్బసం, క్షయ, చాతి ఇన్ఫెక్షన్లపై డాక్టర్ వెంకట కళ్యాణ్ వివరిస్తారని తెలిపారు.

అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మేడికొండూరు


మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాల్లో ఎంపిపి మన్నవ స్వప్న అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత గత సమావేశంలో నిర్ణయించిన అంశాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం



ఎంపిటిసిలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలపై సమీక్షించారు. జెడ్‌పిటిసి కె.సిద్ధయ్య, ఎంపిడిఒ కె.ప్రభాకరరావు, వైఎస్ ఎంపిపి బి.రాజశేఖరరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలోత్సవ్ భవనంలో రేపు 'వైతాళికుల' కొలువు

ప్రజాశక్తి - విజయవాడ



చుట్టూ చీకటి అలముకొని ఉన్నప్పుడు, ఏ మార్గం కనపడక జనం నానా పాట్లూ పడుతున్నప్పుడు వెలుగు దారి వైపు మేల్కొల్పిన మహానుభావులు వైతాళికులు. అలాంటి దీపధారుల చిత్రపటాలను ఆదివారం ఉదయం విజయవాడలోని బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో ఆవిష్కరించనున్నారు.

తెలుగు నాట ఒక్కో కాలంలో ఒక్కో అవసరం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహాయోధులు ఎందరో ఉన్నారు. సమాజంలో అజ్ఞానాంధకారాలు ప్రబలంగా ఉన్నప్పుడు, దురాచారాలు చెలరేగుతున్నప్పుడు తమ మాటలతో, చేతలతో, రచనలతో ఎదురు నిలబడ్డారు వారు. ఆనాటి పాలకులు, దుస్సంప్రదాయాల ప్రేమికులూ ఎన్ని ఆటంకాలు కల్పించినా, దాడులు చేసినా పిసరంత కూడా భయపడలేదు. పట్టుదలతో నమ్మిన బాటలో పయనించి, తెలుగు సమాజానికి వెలుగు దారులు పరిచారు. వేమన, కందుకూరి, పోతులూరి, గురజాడ, గిడుగు, చిలకమర్తి, బండారు అచ్చమాంబ, కొమర్రాజు లక్ష్మణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, కుసుమ ధర్మన్న, త్రిపురనేని రామస్వామి తదితరులు తెలుగు నాట కొత్త ఆలోచనలు మొలకెత్తించారు. తాపీ ధర్మారావు, గరిమెళ్ల సత్యనారాయణ, గుడిపాటి, గుర్రం జాషువా, బోయి భీమన్న వంటివారు సమాజంలో చైతన్యం రగిలించారు. ఇంకా సుంకర సత్యనారాయణ, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, షేక్ నాజర్, దాశరథి, ఆరుద్ర తదితరులు అభ్యుదయ దారులను విస్తృతం చేశారు.

వీరిని ఒక్కో పురోగమన మలుపునకు ప్రతీకగా తీసుకొని, విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రం వైతాళికుల చిత్రపటాలను రూపొందించింది. వీటిని ప్రముఖ చిత్రకారులు గిరిధర్ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో చిత్రించారు. మొత్తం 32 మంది పురోగమన సంస్కృతి వైతాళికుల చిత్రపటాలను ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో శాశ్వత ప్రతిపాదికన అమర్చి, ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో సామాజిక, సాహిత్య విశ్లేషకులు తెలకపల్లి రవి, కథా నవలా రచయిత డా.కెఎన్ మల్లీశ్వరి, ఎస్ఎస్ఆర్ జగన్నాధరావు (క్రియ), బాలాంత్రపు ప్రసూన, అనిల్ డ్యానీ, సత్యాజీ, ఎస్ అనిల్ పాల్గొంటారు.

రషీద్ కుటుంబానికి జగన్ ఓదార్పు

(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్ అమలు చేశారు. అయినా వైసిపి శ్రేణులు పెద్దసంఖ్యలో వినుకొండకు తరలివచ్చారు. వారికి జగన్ అభివాదం చేశారు. పలువురితో కరచాలనం చేశారు. అనతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదనడానికి వినుకొండలో రషీద్ హత్యే నిదర్శనమన్నారు. పల్నాడు జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు వచ్చిన రెండు రోజుల్లోనే వినుకొండలో రషీద్ హత్య జరగటం చూస్తే టిడిపి ముందస్తు పథకంలో భాగమేనన్నారు. గతంలో ఎస్పీగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని ఎన్నికల ముందు తప్పించి అన్యాయం చేశారన్నారు. అప్పట్లో ఎస్‌పి బిందుమాధవ్‌ను తీసుకువస్తే ఆ ఎస్పీని ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసి పల్నాడు జిల్లా ఎస్పీగా మల్లికా గార్గేని నియమించడం జరిగిందన్నారు. జిల్లా టిడిపి నేతల మాట వినడం లేదని ఎస్‌పి మల్లికా గర్గేని బదిలీపై పంపి వారికి అనూకలమైన ఎస్‌పి కంచి శ్రీనివాసరావును తెచ్చుకున్న రెండు రోజుల్లోనే హత్య జరిగిందన్నారు. రసీదును పథకం ప్రకారం హత్య చేస్తే జిలాని ఒక్కడిపై కేసు పెట్టి వదిలివేయడం సరికాదని, హత్యకు పాల్పడిన, సహకరించిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలను మోసం చేస్తున్న బాబు..

ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన



చంద్రబాబు పథకాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని జగన్ విమర్శించారు. 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 పథకం ఏమైందని ప్రశ్నించారు. ప్రతి పిల్లవాడికి తల్లికి వందనం ఇస్తానని చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే క్యాలెండర్ ప్రకారం ప్రజలకు పథకాలు వచ్చేవని, విద్యా జీవన, వసతి దీవెన, అమ్మఒడి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ మాఫీ, రైతు భరోసా, చేయూత, మత్స్యకారులకు భరోసా లాంటి పథకాలు వచ్చేవన్నారు. పథకాలు ఇవ్వటం చేతగాని చంద్రబాబును ప్రజల ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో భయంకర వాతావరణ సృష్టిస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ వెంట మాజీ మంత్రుల అంబటి రాంబాబు, విడదల రజని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మానాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

పొలాల్లోకి వాననీరు

(మొదటి పేజీ తరువాయి)

102.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జులైలో 157 మిల్లీ మీటర్లకు గాను ఇప్పటి వరకు 76.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం డెల్టాకు గోదావరి జలాలు వస్తుండగా పల్నాడు జిల్లాలోని సాగర్ కాల్వలకు కృష్ణా జలాలు వస్తున్నారు. సాగర్ నుంచి విడుదల చేస్తున్న నీరు తాగునీటి అవసరాలకే పరిమితమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అయితే ప్రస్తుతం కాల్వల్లో వస్తున్న నీటిని పొలాలకు మళ్లించుకునేందుకు రైతులు సాహాసం చేయడం లేదు. మూడ్రోజులుగా వర్షాలు కురుస్తున్నందు వల్ల సాగుకు తక్షణం నీటి అవసరం లేదు. పొలాల్లోనే కొంత మేరకు నీరు నిలుస్తుంది.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ మండలాల్లో వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

దుగ్గిరాల 34.8	తెనాలి 12.0
తుళ్లూరు : 28.8	పొన్నూరు 10.6
తాడేపల్లి 26.8	అమరావతి 40.2
కాకుమాను 26.2	బెల్లకొండ 36.4
పెదనందిపాడు 25.4	రొంపిచర్ల 35.4
మంగళగిరి 25	ముప్పాళ్ల 33.8
ఫిరంగిపురం 24.2	దుర్గి 28.8
చేబ్రోలు 23.4	సత్తెనపల్లి 24.8
వట్టిచెరుకూరు 20.8	రాజుపాలెం 23.6
గుంటూరు పశ్చిమ 20.0	చిలకలూరిపేట 23.2
గుంటూరు తూర్పు 18.2	యడ్లపాడు 21.4
కొల్లిపర 17.4	మాచర్ల 20.2
తాడికొండ 16.4	నరసరావుపేట 19.4
మేడికొండూరు16.2	పిడుగురాళ్ల 18.6
పెదకాకాని 15.2	పెదకూరపాడు 17.4
ప్రత్తిపాడు 15.2	

ఎపిలో 167 మిలియన్ కిలోల పంటకు అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు



ఆంధ్రప్రదేశ్‌లో 2024-25 సంవత్సరం పంట కాలానికి 167 మిలియన్ కిలోలు పొగాకు పంట పరిమాణాన్ని టుబాకో బోర్డు నిర్ణయించింది. 163వ పొగాకు బోర్డు సమావేశం శుక్రవారం గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, బోర్డు వైస్ ఛైర్మన్ గుత్తా వాసుబాబు, సభ్యులు పొద వరప్రసాద్‌రావు, హెచ్‌ఆర్ దినేష్, హెచ్‌సి బసవరాజు, కొప్పురావూరి రమేష్‌బాబు, జి.సి.విక్రమ్‌రాజ్, బొడ్డపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. ఢిల్లీ నుండి డిప్యూటీ సెక్రెటరీ మౌనికాగౌర్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బాలునాయక్, కర్నాటక, ఒరిస్సా నుండి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ల పూడికతీత

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో పూడిక తీత జరగని ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన తీయించాలని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కెవిపి కాలనీ, పట్టాభిపురం, స్తంభాల గరువు, భాగ్యనగర్, తుఫాన్‌నగర్ ప్రాంతాల్లో కమిషనర్ శుక్రవారం పర్యటించి ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రెయిన్లలో పూడికతీత పనులు పరిశీలించారు. నగరంలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోని డ్రెయిన్లలో పూడికతీత పనులకు అవసరమైన టెండర్లు ప్రక్రియ పూర్తి అయిందని, ఎక్కువ ప్రాంతాల్లో పూడికతీత పనులు కూడా పూర్తి చేశామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పూడిక తీత పనుల్లో జాప్యం కారణంగా వర్షాలకు డ్రెయిన్లు పొంగి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తక్షణం పూడికతీత పనులు చేపట్టాలన్నారు. భాగ్యనగర్ ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ పూడిక తీయక పోవడంపై ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజల నుండి పారిశుధ్యంపై అందిన ఫిర్యాదుల మేరకు ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్ ద్వారా అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్డు సెంట్రల్ డివైడర్ వెంబడి మట్టి ఉండడం గమనించి, ప్రతి రోజు శుభ్రం చేయాలని శానిటరీ సూపర్వైజర్ ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య పనుల పర్యవేక్షణ స్పెషల్ అధికారులు ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుండి తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పారిశుధ్యంపై ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి వైర్‌లెస్ సెట్ వినియోగించాలన్నారు.



డ్రెయిన్లను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రభుత్వ అధికారి కారు బోల్తా - తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో విధులు నిర్వహిస్తున్న పల్నాడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రంగారావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం చర్లపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఆయన ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన రంగారావును గిద్ద లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దుకాణాల్లో దొంగల చేతివాటం

ప్రజాశక్తి - గుంటూరు సిటీ



తాళాలు పగల కొట్టి పక్కపక్క షాపుల్లో చోరీ జరిగిన సంఘటన స్థానిక కొత్తపేట మద్దినేని గోపాలకృష్ణయ్య హాస్పిటల్ పక్కన ఉన్న మెడికల్ ల్యాబ్‌లో, మెడికల్ స్టోర్‌లో జరిగింది. భారతి ఎక్స్‌రేలో రూ.10 లక్షలు,శ్రీ కోదండ రామా మెడికల్ స్టోర్‌లో రూ.30,000 నగదు చోరీ చేశారని ఆయా షాపుల యజమానులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కొత్తపేట ఎస్సై తరంగణి, వారి క్లూస్ టీం వివరాలు సేకరించింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కారంలో తోడ్పాటు కోసం సిఎంకు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరారు. శుక్రవారం మంగళగిరి టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసి నరసరావుపేటలో నెలకొన్న అశాంతి, రాజకీయ ఘర్షణల గురించి వివరించారు. సాగునీటి కాలువలన్నీ అధ్వానంగా ఉన్నాయని అభివద్ధి పనుల కేటాయింపులో నరస రావు పేటకు తొలి ప్రాధా న్యం ఇవ్వాలని కోరారు.గత పాలకుల నిర్లక్ష్యంతో నియో జకవర్గం అభి వృద్ధిలో పురోగతి లేద న్నారు.



సిఎం చంద్రబాబుకు కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు



ప్రయివేటు బస్సు బోల్తా ఒకరు మృతి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రయివేటు ట్రావెల్ బస్సు బోల్తా పడి వ్యక్తి మతి చెందిన సంఘటన మాచర్ల మండలం నాగార్జున సాగర్-మాచర్ల ప్రధాన రహదారి లోని ఎస్ టర్నింగ్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి 30 మంది ప్రయాణికులతో పోరుమామిళ్ల వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్సు నాగార్జున సాగర్-మాచర్ల ప్రధాన రహదారి ఎస్ టర్నింగ్ సమీపం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది.దీనితో బస్సులో ప్రయాణిస్తున్న కె. నరేష్ బాబు(34) అనే వ్యక్తి మతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం ప్రకాశం జిల్లా వలేటివారిపాలెంగా గుర్తించారు. బస్సులోని



ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి సౌత్ ఎస్ ఐ పట్టాభి రామయ్య తెలిపారు.



కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగు పరచుకోండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతి విద్యార్థి తమ వ్యక్తిత్వ వికాసం, లీడర్స్ షిప్,కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పరచుకోవాలని విద్యా శాఖాధికారి కె. లక్ష్మీ భాయ్ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ స్కూల్‌లో విద్యార్థుల ఎన్నికల సందర్భంగా జరిగిన కార్య క్రమానికి ఆమె ముఖ్య అతిథిగా వచ్చారు. ప్రధానో పాధ్యాయులు కె.శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థిని తరుపున ఒక విద్యార్థిని, వి ద్యార్థుల తరు పున ఒక విద్యార్థిని, ఎన్నుకున్నట్లు చెప్పారు. ఇది పిల్లల మధ్య స్నేహ భావం పెంపొందించడానికి, అభివృద్ధి,మానసిక వికాసం కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికైన విద్యార్థినీవిద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖ అధికారితో పాటుగా తల్లిదండ్రులు వారిని అభి నందించారు. అనంతరం విద్యా శాఖాధికారిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ పల్నాడు జిల్లా ఎ.జి.ఎం.కె. లక్ష్మణ రెడ్డి,జెడ్.సి.ఓ.గౌస్య భేగం, స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	28,227
మిర్చి ఎగుమతి	34,045
మిర్చి నిల్వ	13,635

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 16,500
నెం.5	10,000 - 15,000
273	10,500 - 13,000
341	8,500 - 13,500
4884	15,500 - 15,800
సూపర్ 10	12,000 - 15,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 18,200
బడిగి	8,000 - 14,000
దేవనూరు డీలక్స్	10,000 - 10,500
తాలుకాయలు	4,000 - 12,000
ఎసి	
334	10,000 -17,000
నెం.5	10,500 -14,000
273	12,000 - 12,000
341	9,000 - 15,000
4884	9,000 - 15,000
సూపర్ 10	11,100 - 11,100
తేజ	10,000 - 18,500
బడిగి	9,000 - 13,200
దేవనూరు డీలక్స్	10,000 - 10,000
తాలుకాయలు	5,000 - 11,000



చిలకలూరిపేటలో జగన్‌కు స్వాగతం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వినుకొండ వెళుతున్న సందర్భంగా స్థానిక పట్టణంలోని శుక్రవారం నాడు ఎన్ఆర్టీ సెంటర్లో వర్షంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్ కారు ధిగకుండానే కారులో ఒకవైపు నిలుచుని ప్రజలకు అభివాదం చేశారు.పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద గుంటూరు నగరమేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు స్వాగతం పలికారు



రైతులకు శిక్షణా కార్యక్రమంలో శాస్త్రవేత్తలు

పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పంటల యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన కల్పించాలని లాంఫాం ప్రాంతీయ పరిశోధన సంస్థ డాక్టర్ ఎం.నగేష్ ఉద్యానవన వ్యవసాయ సహాయకులకు సూచించారు.సత్తెనపల్లి పట్టణంలోని అగ్రి ల్యాబ్‌లో గ్రామ వ్యవసాయ , ఉద్యానవన సహాయకులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాం ఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్ర వేత్తలు డాక్టర్. ఎం.నగేష్ ఎం.వెంకట రాములు, ప్రత్తి పంటలో అధిక వర్షాల సమయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు మిరపనారు మడులలో చేపట్టాల్సిన విత్తన శుద్ధి,యాజమాన్య పద్ధతులు, వరి పంటలో తక్కువ కాలపరిమితి మరియు తెగుళ్లను తట్టుకునే వంగడాలు గురించి వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు శిక్షణ ఇచ్చారు.

పదో తరగతి విద్యార్థులకు రేపు ఉపకార వేతనాలు పంపిణీ


ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ ,సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి లోని వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి . ముఖ్య అతిధిగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖామాత్యులు ఆనం రామ నారాయణరెడ్డి పాల్గొంటారని చెప్పారు. టిడిపి నాయకులు కార్యకర్తలు సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఉపాధి హామీ'పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి

ప్రజాశక్తి-క్రోసూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పని చేసిన వారి కూలి బకాయిలను వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవి బాబు డిమాండ్ చేశారు. రైతు , కౌలు రైతు, వ్యవ సాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా ఆయా సమస్యలపై మండలంలోని క్రోసూరు, 88 తాళ్లూరు, దొడ్లేరు సచివాలయాల వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన ఉపాధి కూలీలకు 4 నుండి 5 వారాల వరకు రావాల్సిన ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ,ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన



క్రోసూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సహాయం రూ.20 వేలు వెంటనే అందించాలని, భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించి , భూమిలేని కౌలు రైతులకు కూడా పెట్టుబడి సహాయం అందించాలని అన్నారు. గత సంవత్సరం సాగర్ కాలువ రాకపోవడం వలన కాలువ చివర భూములు కావడంతో పంట దిగుబడులు రాక నష్టపోవడం జరిగిందని, తమ మండలంలో కొన్ని ప్రాంతాల్లో కూడా లిఫ్ట్‌ల ద్వారా పంటలు సాగవుతున్న నేపథ్యంలో గ్రామ గ్రామానికి పంట దిగుబడులలో వ్యత్యాసం వుందని అన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు , రైతు సంఘం మండల అధ్యక్షుడు అత్తోట వెంకట అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వర్లు, రైతు కౌలు రైతువ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కె తాతారావు,వల్లంశెట్టి వెంకటేశ్వర్లు,యార్లగడ్డ నాగేశ్వరరావు, షేక్ ముస్తఫా, చిలుకయేసయ్య, మరియమ్మ, మరి రామకృష్ణారెడ్డి, షేక్ రఫ్, దగ్గు చిన్న గోపి పాల్గొన్నారు.



పిడుగురాళ్లలోని 14వ సచివాలయం అడ్మిన్ అశోక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో పిడుగురాళ్ల చెరువు కట్టబజార్‌లోని 14వ సచివాలయం అడ్మిన్ అశోక్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తున్నా రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడం శోచనీయ మన్నారు. రైతులకు సరైన సమయంలో పెట్టుబడి సహాయం అందక,ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నా రని, అధిక వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి వ్యవసాయం చేయాల్సి వస్తోందని అన్నారు. పిఎం కిసాన్ నిధులు రకరకాల కారణాలతోటి రైతులకు మోడీ ప్రభుత్వం ఎగనామం పెట్టిందని వారు విమర్శించారు. అదేవిధంగా పల్నాడు ప్రాంతంలో విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు అమ్మకాలు జరుగుతుంటే అధికారులు నిమ్మక నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని, రైతులకు సబ్సిడీ ప్రకారం పురుగు మందుల విత్తనాలు పంపిణీ చేయాలని అన్నారు. మిచౌంగ్ తుఫాను వలన నష్టపోయిన రైతులకు పంట నష్టం కింద ఒక్క రూపాయి వేయలేదని, వారికి అందాల్సిన పరిహారాన్ని వెంటనే ఎలాంటి నిబంధనలు లేకుండా విడుదల చేయాలని మొదలైన సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భక్తులు వెంకటేశ్వర్లు,రైతు సంఘం నాయకులు బుంగ్గ నాగేశ్వరరావు, నరసింహారావు,వెన్ను వెంకటేశ్వర్లు,ఏ కోటిరెడ్డి,నాయుడు,షేక్ బాబు,గుదే పూర్ణయ్య,నాగేశ్వర్ రెడ్డి,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా పరిహారాన్ని ఖాతాల్లో జమ చేయండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పెదకూరపాడు పంచాయతి కార్యదర్శి సుధారాణికి అందించారు. ప్రభుత్వ వెంటనే స్పందించి పంటల బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని పెదకూరపాడు పంచాయతి కార్యదర్శి, సర్పంచ్ రాజు ద్వారా ముఖ్యమంత్రికి అందించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్తు మోటర్లకు మీటర్లు బిగించొద్దని, జీవో నెంబర్ 22ను రద్దు చేసి ఉచిత విద్యుత్‌ను కొన సాగించాలని, పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఆ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, బంకా దాసు, బుజ్జి, గంగయ్య, అంద్ర శ్రీను, ముస్తఫా పాల్గొన్నారు.



కౌలు రైతుల, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - అమరావతి

కౌలు రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రజాసంఘాల కన్వీనర్ బి .సూరిబాబు కోరారు. మునుగోడు గ్రామ సచివాలయ అధికారి సింధు,అమరావతి కార్యదర్శి నాగరాజు, ఎండ్రాయి గ్రామ సచివాలయ అధికారులకు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూరైతులకు వాగ్దానం చేసినట్టుగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ప్రభుత్వం నేటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో తీసుకువచ్చిన జీవో నంబర్ 22ను కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని ,ఉపాధి పథకంలో పని చేసిన కూలీలకి రావాలిల్సన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ మోదిన్ వలి, చింక కృష్ణ, ఎస్‌కె రఫి, ఎం.సుబ్రహ్మణ్యం నండూరి వెంకటేశ్వర రాజు, సయ్యద్ రహీం,పరమేశ్వరరావు, ఎం.నీలగిరి పాల్గొన్నారు.

గురజాలలో పర్యటించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి .అరుణ్ బాబు గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తొలి సారిగా గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును రెవెన్యూ డివిజన్ అధికారి రమణ కాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుర జాల రెవెన్యూ డివిజన్ పరిధిలో వస్తున్న భూ సమస్యలు రెవెన్యూ సంబంధించిన సమస్యలు, ఎంతమంది రెవెన్యూ డివి జన్ కార్యాలయంలో సిబ్బంది పనిచేస్తున్నారు వారి వివరాలని సేక రించారు. అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్‌రెడి పాల్గొన్నారు.

డయేరియా, మలేరియా, డెంగీని నియంత్రించండి

ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో డయేరియా, మలేరియా, డెంగీని నియంత్రించాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ఇటీవల ఆయన పర్య టించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లా డుతూ వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరు ఎక్కడికక్కడ రోడ్ల పైన డ్రైనేజీలో ఉండడంతో దోమల వ్యాప్తితో డయేరియా, డెంగ్యూ, మలేరియా, అతిసార వంటి విషపు జ్వరాలు గ్రామాల్లో ప్రబలు తున్నాయని ఇంత జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో పరిశుభ్రత పాటించకపోవడం దారుణమన్నారు. పారిశుధ్య లోపం వలన దోమలు పెరిగిపోతున్నాయని, దీనివలన చిన్న పిల్లలు పెద్దలకు అంటురోగాల బారిన పడుతున్నారని బ్లీచింగ్, ఫాగింగ్, శానిటేషన్ లోపం వలన ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉంటుందన్నారు. వాటర్ ట్యాంకులు సరైన సమయంలో శుభ్రం చేయక నెలలు గడుస్తున్నా వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం లేదన్నారు. కనీసం 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులో శుభ్రం చేయాలని గ్రామాల్లో తరచూ బ్లీచింగ్ చల్లాలని, దోమల నివారణ మందులు పిచికారీ డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోగాలు ప్రభలక ముందే అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీ మేరకు పెట్టుబడి సాయం కోసం వినతులు



ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు సత్వరమే అందజేయాలని రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలోనూ అధికారులకు రైతుల సమస్యలపై శుక్రవారం వినతిపత్రాలు ఇచ్చారు. ఇందులో భాగంగా తాడేపల్లిలోని కృష్ణని వద్దగల సచివాలయ అడ్మిన్‌కు అర్జీ అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వెంటనే ఈ సాయం అందించి ఆదుకోవాలని కోరారు. భూ యజమానుల సంతకాలతో సంబంధం లేకుండా కౌలురైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెదవడ్లపూడి హైలెవర్ ఛానల్ పనులు వెంటనే పూర్తి చేసి ఆ ప్రాంత రైతాంగానికి చివరి భూములకు నీరు అందించే విధంగా చూడాలన్నారు. చిర్రావూరులో పశువుల ఆసుపత్రి నిర్మించాలని కోరారు. కొండవీటి వాగు ముంపు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.దశరధరామిరెడ్డి, బి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండల కేంద్రమైన పెదనందిపాడు, మండలంలోని నాగులపాడు, వరగాని సచివాలయాలల్లో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటశివరావు మాట్లాడారు. మండల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు జె.రామారావు, పి.శేషగిరిరావు, డి.శ్రీనివాసరావు, జి.మల్లేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తెనాలిరూరల్

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయరుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఐతానగర్ ఒకటవ సచివాలయంలో పాల రైతుల సంఘం కన్వీనర్ వెజెండ్ల తబిత, పాల రైతులతో కలసి వినతి పత్రం అందించారు. గతేడాది పశు పోషణ కోసం పొందిన రుణాలు తరహాలో పాడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.ప్రసాద్, ఎ.కమలమ్మ, ఎం.దనమ్మ, టి.శాంతకుమారి, సిహెచ్.మార్తమ్మ, శ్యాంబాబు, మేరమ్మ పాల్గొన్నారు.



ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-తాడేపల్లి

రెండ్రోజుల నుండి కురుస్తున్న వానలతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బోటుయార్డు, రామయ్యకాలనీ, డాల్డా కంపెనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు బురద పేరుకుపోయి చిత్తడిచిత్తడిగా తయారయ్యాయి. బోటుయార్డు వద్ద ఇళ్లల్లోకి నీరు చేరడంతో రాత్రులు నిద్ర లేకుండా జాగారం చేయాల్సి వస్తుందని పేదలు వాపోతున్నారు. తమకు శాశ్వత స్థలాలు కేటాయించి ముంపు బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. తాజా పరిస్థితులతదో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మున్సిపల్ అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు.

శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కృష్ణనగర్ అంగన్‌వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవనం నిర్మించాలని స్థానిక అంగన్‌వాడీలు ప్రజా దర్బార్‌లో నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. అద్దె భవనాలకు అద్దెలు చెల్లించలేక సెంటర్లు నడపడం కష్టంగా ఉందని చెప్పారు. నవులూరుకు చెందిన బేతపూడి కోటేశ్వరరావు తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందజేయాలని ఉండవల్లికి చెందిన మైనర్‌బాబు కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ అర్జీలను లోకేష్‌కు అందజేశారు



లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

తెనాలిలో మంత్రి మనోహర్ సుడిగాలి పర్యటన

ప్రభుత్వాస్పత్రికి సందర్శన - పట్టణంలో పారిశుధ్య పనులు, డ్రెయిన్ల పూడికతీత పరిశీలన



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత జిల్లా వైద్యశాలకు చేరుకున్న ఆయన రోగులతో మాట్లాడి వైద్య సదుపాల గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో మురుగునీటి పారుదలను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు చేపట్టిన మురుగు కాల్వల పూడిక తీతను పరిశీలించారు. గంగానమ్మపేటలో మురుగు కాల్వల పూడిక తీత పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. ఇంకా మరిన్ని సేవల విస్తరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. ప్రధాన రోడ్ల వెంట కాల్వల పూడికత తీతకు చర్యలు తీసుకున్నామని, ఇంకా పనులు కొనసాగుతున్నాయని అన్నారు.

ఇసుక వసూళ్లపై తనిఖీ

ప్రజాశక్తి-కొల్లిపర



ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని మున్నంగి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అభియోగం రావడంతో ఇసుక స్టాక్ పాయింట్‌ను మంత్రి శుక్రవారం తనిఖీ చేశారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేవపెట్టిందని, నేరుగా వినియోగదారులకు ఇసుక చేరేట్లు చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ పథకానికి తూట్లు పొడిస్తే చర్యలు తప్పవన్నారు. పరిశీలనలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ విష్ణుప్రసాద్, జనసేన నాయకులు బి.కిషోర్‌రెడ్డి, కె.శ్రీహరిరెడ్డి ఉన్నారు.

కాలు పెడితే.. జారి పడటమే..

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామమైన డోలుపర్రు ప్రధాన రహదారి బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో చిన్నపిల్లలు, 250 మంది వరకు విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నికావు. జారుతున్న బురదలో నడవలేక కొంతమంది పుస్తకాల బ్యాగులతో సహా రోడ్డుపై పడిపోయారు. గ్రామంలో జల్ జీవన్ నిధులతో పైపులైను పనుల్లో భాగంగా పైపు వేసేందుకు గుంతలు తీసి మట్టిని రోడ్డుపై పోశారు. పనులు పూర్తయ్యాక మట్టిని తిరిగి గుంతల్లో పోచకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో వాహనాలు వెళ్లాలంటే పడే అవస్థలు అన్నీఇన్ని కావని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పైపులైను కోసం



గుంతల తవ్వకాన్ని పంచాయతీ అనుమతి లేకుండానే చేపట్టారనే విమర్శలు వస్తున్నాయి.

ఫుట్ బ్రిడ్జ్‌ను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-దుగ్గిరాల



డెల్టా ప్రధాన కాల్వ బకింగ్ హామ్ కెనాల్‌పై దుగ్గిరాల కొత్తలాకుల వద్ద ఉన్న ఫుట్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరి అత్యంత ప్రమాదకరంగా మారటంతో స్థానికులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బ్రిడ్జిని జలవనరుల శాఖ ఎస్ఇ వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం శు క్రవారం పరిశీలించింది. మరమ్మతుల విలువ అంచనా వేయించి తక్షణ మరమ్మతులు చేపడతామని ఎస్ఇ తెలిపారు. ఫుడ్ బ్రిడ్జికు ఇరువైపులా ఉన్న రైలింగ్ పూర్తిస్థాయిలో దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. కాల్వకు అవతలకు జగనన్న కాలనీ ఉండడంతో ఈ బ్రిడ్జిపై ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. రైతులతో పాటు పాఠశాల వెళ్లే విద్యార్థులు కూడా ఇటుగా వెళ్లాల్సి ఉంటుంది. పరిశీలనలో జల వనరుల శాఖ ఈఈ ఎస్.మల్లికార్జునరావు డిఈ ఎన్‌కెవి ప్రసాద్, ఎఇ వనిత, టిడిపి నాయకులు జి.వెంకటరావు పాల్గొన్నారు.



వీరిశెట్టి శ్రీనివాసరావు చొరవతో పొలాల్లో నుండి బయటకు నీరు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఎడతెరిపిరిని వర్షాలతో, చిర్రావూరు, గుండిమెడ, ప్రాతూరు గ్రామాల్లో సుమారు 600 ఎకరాలు వరి పొలాలు నీట మునిగాయి. వర్షపు నీరు బయటకు పోయే దారి లేక, మురుగు కాల్వ పూడుకు పోవడంతో వర్షపు నీళ్లన్నీ పొలాల్లోనే నిలిచిపోయాయి. దీంతో రైతులు తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పరిష్కారం చేయాలని కోరుతూ సమస్యను టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం జెసిబిని తెప్పించి మురుగు కాల్వలో మట్టిని, తుటికాడను తీయించ డంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లింది. శ్రీనివాసరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా మురుగు కాల్వ సమస్యను వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. నారా లోకేష్ స్ఫూర్తితో గ్రామ టిడిపి రైతులకు అండగా ఉంటుందని అన్నారు. జనసేన పార్టీ నాయకులు సిహెచ్ లాల్‌చంద్, పి.పాములు రైతులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిలిమ్ పోటీలకు 'కొండమ్మ' ఎంపిక

ప్రజాశక్తి-తాడేపల్లి : ప్రముఖ కవి దాశరధి శత జయంతి సందర్భంగా దాశరధి ఫిలిమ్ సొసైటీ హైదరాబాద్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి తెలుగు షార్ట్‌ఫిల్మ్ పోటీలకు త్రినేత్ర ప్రొడక్షన్స్ ఉండవల్లి 'కొండమ్మ' షార్ట్‌ఫిలిమ్ ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు త్రినేత్ర ప్రొడక్షన్స్ రచయిత, దర్శకుడు గాదె నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన షార్ట్ ఫిలిమ్‌ల స్క్రూటినీ అనంతరం ఆరు షార్ట్‌ఫిలిమ్‌లను న్యాయనిర్ణేతలు ఫైనల్ స్క్రీనింగ్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. అందులో కొండమ్మ షార్ట్ ఫిలిమ్‌కు స్థానం దక్కిందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ ఆడిటోరియంలో ఫైనల్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వండి
- మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి
- పలు దుకాణదారులకు జరిమానా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు పురపాలక సంఘం అధికారులు చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని అదేవిధంగా పారిశుధ్య పనుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి సంబంధిత మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి చిలకలూరిపేట రోడ్డు వరకు పర్యటించారు.ఆ మార్గంలో తేనేటి దుకాణాల వద్ద , అల్పాహార హెూటళ్ల వద్ద, తోపుడు బండ్ల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి జరిమానా విధించారు. ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా చెత్త డబ్బా ఏర్పాటు చేయాలని పారిశుధ్య సిబ్బంది వచ్చి తీసుకువెళ్లడం జరుగుతుందని దీనిపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అవసరమైతే దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు.




నరసరావుపేటలోని ఓ ఇంటి వద్ద తొట్టిలో నీటిని తొలగిస్తున్న చిత్రం, ఓ దుకాణం వద్ద మున్సిపల్ కమిషనర్

12, 34 వార్డులలో ఫ్రైడే డ్రై డే

పట్టణంలోని 12 , 34 వార్డులలో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు.ప్రతి15 రోజులకు ఒకసారి మురుగు కాల్వలు శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని వాటికి సంబంధించి రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మంచినీటి పైపులైను లీకేజీకి సంబంధించి క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వార్డు సచివాలయ సిబ్బంది వర్షాకాలం సమయంలో వ్యక్తిగత, ప్రాథమిక పరిశుభ్రత, నివారణ చర్యలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధులకు సంబంధించి వ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయా ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛమైన నీటి సరఫరా అయ్యేలా చూడాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి నీరు తొలగించడం లేదా ఇసుక కంకర రాళ్లు వేసి పూడ్చి వేయడం, కాల్వలో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయడం, దోమతెరలు వాడకం పై అవగాహన కల్పించడం అదే విధంగా తొట్టె లలో ఇంకుడు గుంతలలో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు.

తాజా ఆహారం, ఆహార పదార్థాలను తీసుకోవాలని సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం, నీటిని కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. సదరు కార్యక్రమంలో డి.ఇ ఓ. శ్రీనివాస రావు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రామకోటయ్య, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

నీటిని కాచి చల్లార్చి తాగండి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పట్టణంలోని మున్సిపాలిటీ ఆఫీసు ఆవరణలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంక్ లో పనిచేసే ఫిల్టర్ బెడ్స్ రెండు రోజుల క్రితం చెడి పోవటం జరిగిందని, కావున పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని మాచర్ల మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు కోరారు. వాతావరణం చల్లగా ఉంటుంది, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది ,కాబట్టి ప్రజలు మంచినీటిని కాచి వడబోసుకొని తాగాలని తెలిపారు. చెడి పోయిన ఫిల్టర్ బెడ్స్ ని యూనిక్ కెమికల్స్ వారిని బాగు చేయించడం జరుగుతుందన్నారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు.



రత్నకుమార్ కుటుంబానికి టిడిపి సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ నాయకుడు నీలం రత్నకుమార్ పార్థివ దేహాన్ని పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు అర్తిమల్ల రమేష్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో బెల్లంకొండ రాంగోపాల్ రావు గల్లా బాబురావు భాష్యం ఆంజనేయులు షేక్ అజిమల్ల పరుచూరి పూర్ణచంద్రరావు మండల ఎస్సీ సెల్ నాయకుడు జంగాల ప్రసాదు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడటం సిగ్గుచేటు'

ప్రజాశక్తి-విజయపురిసౌత్

తన హయాంలో రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన జగన్మోహన్‌రెడ్డి ఏపీలో చట్టాలు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లు ఉందని పల్నాడు జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతులూరి కుమార్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో దాడులు దౌర్జన్యాలు చేసినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కనీసం వైసీపీ ప్రభు త్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కొరకు ఒక్క సారైనా మీటింగ్ పెట్టిన దాఖలాలు లేవన్నారు.

పశు పోషణకు ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశుగ్రాస వారోత్సవాల పేరిట పశుగ్రాస విత్తనాల పంపిణీతో వ్యవసాయ రంగానికి అనుబంధ రంగమైన పాడి పరిశ్రమ రైతులకు చేయూతనిస్తుందని రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామ పశు వైద్యాధికారి డాక్టర్ ఆవుల సాయి మహేష్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా పశు వైద్యశాలలో రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న పశు పోషకులు తమ సాగు భూమిలో కనీసం 10 శాతం పశు గ్రాసం సాగు చేయాలన్నారు. ప్రభుత్వం పశు పోషణకు మేలు రకాలైన గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా, పశు వైద్యశాల ద్వారా సరఫరా చేస్తుందని తెలిపారు. జొన్న, మొక్కజొన్న రకం పశుగ్రాసాలను 75 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 5 నుండి 20 కిలోల వరకు సరఫరా చేస్తామన్నారు. ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకొని పశుగ్రాసాన్ని పెంచాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శవ రాజకీయాలకు తెరలేపారు

- టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్
- మాజీ సిఎం జగన్‌పై విమర్శలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి హయాంలో ఎన్నో అరాచకాలు సృష్టించి , ఎంతోమంది టిడిపి నాయకులను, కార్యకర్తలను పొట్టన పెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శాంతిభద్రతల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్ అన్నారు.

శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ వినుకొండ ఘటన అత్యంత బాధా కరమని, దీంతో టిడిపికి సంబంధం లేదని తేల్చి చెప్పారు. తండ్రి మృతదేహాన్ని పక్కన పెట్టుకొని సంత కాల సేకరణ చేసి బాబాయిని హత్యతో పాటు ఎన్నో శవాల పునాదులపై ఏర్పడిన వైసిపి దానికి అనుగుణం గానే నేడు వినుకొండ ఘటనను పార్టీ రంగులు పులిమి శవ రాజకీయాలకు తెర లేపారన్నారు. తమ కార్యకర్తల కుటుంబాలను ఓదార్చటంలో ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేదని, అలా కాకుండా పచ్చని పల్లెల్లో రాజకీయ చిచ్చు పెట్టవద్దని హితవు పలికారు.

'హత్యా రాజకీయాలకు కేరాఫ్ వైసిపి'

హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని వినుకొండలో ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత వివాదాల మధ్య జరిగిన హత్యను కేవలం రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినుకొండ వస్తున్నాడని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆరోపించారు. 40 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన టిడిపి ఎన్నడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినుకొండ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఎక్కడా అడ్డుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన టిడిపి ప్రభుత్వానికి వినుకొండ ఘటన అపాదించడం సబబు కాదన్నారు. హత్యా రాజకీయాల గురించి జగన్ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డికి దమ్ముంటే ఐదేళ్ల వైసిపి హయాంలో జరిగిన హత్యలకు, వినుకొండ ఘటన పై బహిరంగ చర్చకు రావాలన్నారు.

శవరాజకీయాలు సిగ్గుచేటు

ప్రజాశక్తి-వినుకొండ

వ్యక్తిగత కక్షలు నేపద్దంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన హత్యకు రాజకీయరంగు పులిమి శవ రాజకీయాలు చేయటం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి సిగ్గుచేటని వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు.

శుక్రవారం సాయంత్రం టిడిపి కార్యా లయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏమి జరిగిందని రాష్ట్రపతి పాలన పెట్టాలంటూ జగన్ రెడ్డి మాట్లాడుతున్నాడో అర్థం కావటం లేదన్నారు. రషీద్ హత్యకు కారకులు బ్రహ్మానాయుడు, ఖాన్ అని, బాధ్యత వహిస్తూ జగన్మోహన్ రెడ్డి వినుకొండ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఐదేళ్ల పాలనలో అనేక హత్యలు, అమాయకులపై దౌర్జన్యాలు దుర్మార్గాలు దళితులపై దాడులు జరిగితే స్పందించని జగన్మోహన్ రెడ్డి ఇద్దరు వ్యక్తిగత కక్షలో చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చి శవ రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అసత్యాలు మాట్లాడటం బాధాకరమన్నారు.



బెజగం రవికుమార్‌కు పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన పౌరాణిక కళా కారుడు బెజగం రవి కుమార్ కి బెజగం రవి కుమార్ కి 'అల్లూరి సీతా రామ రాజు నట కళా సామ్రాట్' పురస్కారం ప్రదానం చేశారు. ఈ మేరకు గురు వారం ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ, శ్రీశైలం దేవస్థానం కమిటీ వారు , లిటిల్ ఛాంప్స్ అకాడమీ వారి సంయుక్త ఆధ్వ ర్యంలో శ్రీశైలం దేవస్థానం సమీపంలో ధర్మ పదం కళా సాంస్కృతిక ఆరోగ్యకళా వేదికపై పురస్కార ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బెజగం రవి కుమార్ కి పౌరాణిక రంగం లో విభిన్న పౌరాణిక పాత్రలు ధరించి రెండు రాష్ట్రాల స్థాయిలో ప్రేక్షకులను రంజింప చేసి నందుకు 'అల్లూరి సీతా రామరాజు నట కళా సామ్రాట్' పురస్కారంప్రదానం చేశారు. సత్తెనపల్లి లో వివిధ కళా సంస్థల వారు మిత్రులు శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.

డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

డయేరియా, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం,డాక్టర్ గ్రంధి రామారావు పట్టణ ప్రజలకు పలు సూచనలు చేశారు. స్థానిక పట్టణ ఆర్యవైశ్య సం ఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ డయేరియా, విషజ్వరాల బారిన పడకుండా ఉండేందుకు మనం తాగాల్సిన నీటిని ఒకరోజు ముందుగానే వేడి చేసుకుని చల్లార్చుకోవాలని, చల్లార్చిన నీటిలో పటికను వేస్తే ఆ నీటిలోని కల్మషం తొలగిపోతుందన్నారు. దోమకాటుకు గురికాకుండా ఉండేందుకు దోమతెర వాడుకోవా లని సూచించారు. ముఖ్యంగా డెంగీ దోమ పగటిపూట మోకాలు కింది భాగంలో మాత్రమే కుట్టే అవకాశం ఉందన్నారు. టీ స్టాల్స్ లో లేదా ఇతరచోట్ల మినరల్ వాటర్ పేరిట అందించేవి మినరల్ వాటర్ కాకపోవచ్చని, పూర్తిగా ప్యూరి ఫైడ్ వాటర్ అని చెప్పలేమన్నారు. కనుక బయట నీళ్లు తాగేటప్పుడు బ్రాండెడ్ కంపెనీ వాటర్ బాటిల్స్ వాడుకోవం మంచిదన్నారు. పట్టణ, నియోజకవర్గ ప్రజలు ఇటువంటి జాగ్రత్తలు పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

కన్నాను పరామర్శించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ను గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం పరామర్శించారు. భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రామాంజనేయులు పరామర్శించి ఆరోగ్య సమస్యలు గురించి తెలుసుకున్నారు.



ప్రజాశక్తి 7

గుంటూరు జిల్లా

శనివారం 20 జులై 2024

పేదల బడి.. కూలడానికి సిద్ధపడి..

- ఏళ్ల తరబడి విన్నవిస్తున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- శిథిలావస్థలో డిఎన్‌టి పాఠశాల భవనం - అద్దె ఇంట్లో తరగతులు



దెబ్బతిన్న పాఠశాల గోడలు

ప్రజాశక్తి - మంగళగిరి

పేదల కాలనీలో 33 ఏళ్ల కిందట ఏర్పాటై.. వందలాది మంది పిల్లలు అక్షరాలు దిద్దిన భవనం ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై కూలడానికి సిద్ధమైంది. పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మి నరసింహ స్వామి మెట్ల మార్గంలో డిఎన్‌టి ప్రాథమిక పాఠశాలను 1965లో స్థాపించారు. ఇందులో స్థానికంగా ఉన్న ఎస్టీ, బీసీ సామాజిక తరగతుల పిల్లలు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాల భవనం కొన్నేళ్లుగా దెబ్బతింటూ ఉండడంతో క్రమంగా పాఠశాల నిర్వహించలేని స్థితిని చేరింది. విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి ఈ విషయాన్ని పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న వారు లేరు. ఉన్నతాధికారులు పరిశీలిస్తారని ఒ సందర్భంలో చెప్పినా అదీ జరగలేదు. భవనం కూలిపోయే దశకు వచ్చిందని, పిల్లల్ని ఇందులో ఉంచొద్దని ఆర్ అండ్ బి అధికారులు చెప్పినట్లు స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలకు పిల్లలను పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతుండడంతో హెచ్‌ఎం చొరవ చేసి సమీపంలోని ఓ ఇంటిని సొంత డబ్బులతో అద్దెకు తీసుకుని అందులో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలూ కల్పిస్తున్నామని, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ బడుల్లో చదవాలని ప్రభుత్వాలు, అధికారులు ఒకవైపు ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల పోటీని తట్టుకుని నిలబడ్డ పాఠశాలలు కునారిల్లుతున్నా పట్టించుకోవడం లేదు.. అనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.



మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాం

జగ్జీవన్‌రావ్, పాఠశాల హెచ్‌ఎం.



ఈ పాఠశాలలో 1 నుండి 5 వరకు తరగతులున్నాయి. ఇక్కడ చదివేవారంతా పేద పిల్లలే. భవనం పరిస్థితి బాగోలేకపోవడంతో తరగతులు నిర్వహించడానికి భయంగా ఉంది. అందుకే అద్దెకు ఓ ఇంటిని తీసుకుని అందులో తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సత్వరమే నూతన భవనం నిర్మించాలి

ఎస్.గణేష్, సిపిఎం నాయకులు



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందిన గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, మంత్రి స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలి.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తెనాలి పట్టణ, పరిసర ప్రాంత వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపిసిపి డిసిఎల్ ఆపరేషన్స్ డివిజన్ తెనాలి ఈఈ వివి చిరంజీవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక చెంచుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో తెనాలి పరిసరప్రాంత ప్రజలు పాల్గొనవచ్చని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారుల నుండి సలహాలు, సూచనలు పొందాలని పేర్కొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల : వినుకొండలో వైసిపికి చెందిన రషీద్‌ను హత్య చేయడం అందర్నీ కలచివేస్తోందని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. స్థానిక మురుజానగర్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అత్యంత అనాగరికంగా జరిగిన హత్యలో దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో దాడులకు పాల్పడుతున్న వారు ఏ స్థాయి వ్యక్తులైనా, ఏ పార్టీవారైనా పార్టీలకతీతంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎఐపై కెఎల్‌యులో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని కంప్యూటర్ సైన్స్ రెగ్యులర్ విభాగం అధ్వర్యంలో జనరేటివ్ ఎఐ, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథస్సు) ఒక మైలురాయి అని విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ అన్నారు. సదస్సుకు దాదాపు 160 మంది హాజరయ్యారని తెలిపారు. ముఖ్య అతిథులుగా మైసూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.హేమంత్ కుమార్, కలకత్తాకు చెందిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి ప్రసాద్ ముఖర్జీ, చెన్నైలోని భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఆర్.ఎం.సురేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జనరేటివ్ ఎఐలో అత్యాధునిక పరిణామాలను అన్వేషించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధకులు, ఆవిష్కర్తలను, అభ్యాసకులను ఈ సదస్సు ద్వారా ఒకచోటకు చేర్చినట్లయిందన్నారు. కృత్రిమ మేథస్సులో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రం, నూతన అభ్యాసం, చిత్రాలు, శబ్దాలు, మానవ-వంటి పరస్పర చర్యలను స్వయం ప్రతిపత్తితో సృష్టించగల యంత్రాల సామర్థ్యంపై దృష్టి పెడుతుందన్నారు. హెల్త్ కేర్, ఫైనాన్స్, క్రియేటివ్ ఆర్ట్స్, అంతకు మించిన విభిన్న రంగాల్లో దాని ధరఖాస్తులతో సహా, జనరేటివ్ ఎఐలోని వివిధ అంశాలను పరిశోధించడం ఈ సదస్సు లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ విసి డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్‌కుమార్, కన్వీనర్-డాక్టర్ కె.భానుప్రకాష్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా ప్రధాన రహదార్లకు ప్యాచ్ వర్క్‌లు తక్షణం చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. ప్రజాప్రతినిధుల క్షేత్రస్థాయి పర్యటనల్లో సంబంధిత అధికారులు కూడా పాల్గొని, పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారనికి చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి, నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని, వర్షాకాలం అనంతరం శాశ్వత పరిష్కారంగా రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించాలని, లేకుంటే వారికి నోటీసులు జారీచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈలకు స్పష్టం చేశారు. పీకలవాగుపై దెబ్బతిన్న కల్వర్ట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే ఎక్కడైనా డ్యామేజి జరిగి, ప్రజల రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్న వాటివద్ద రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని పాత యుజిడి సెప్టిక్‌ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల క్షేత్రస్థాయి పర్యటనలలో స్థానిక అధికారులు పాల్గొనాలని, ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి టైంలైన్ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం స్థానిక కాలనీల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించడానికి ప్రతిపాదించిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి రోడ్ నిర్మాణం చేయాలని, పనుల అసంపూర్తి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పీకలవాగుకు రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాల్వల్లో తీస్తున్న సిల్ట్‌ని వెంటనే తొలగించకపోవడం వలన మరలా అది కాల్వలోనే పడుతుందన్నారు. అనేక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటున్నాయని, వాటిని తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. నియోజకవర్గంలోని పార్క్‌లు, వాకింగ్‌ట్రాక్‌ల అభివృద్ధిపై వివరాలు ఇవ్వాలన్నారు. వీధిదీపాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్ఇ శ్యాంసుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డిఈఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కాటూరి హాస్పిటల్ వైద్యులు

200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని నాగులపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి వారు సువర్ణ భారతీ మహోత్సవం సందర్భంగా, భారతీ తీర్థ మహాస్వామి 50వ సన్యాస స్వీకరణ మహోత్సవం సందర్భంగా నాగులపాడు స్థానిక పుట్ట వద్ద శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ చినకోండ్రుపాడు సహకారంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు. షుగర్, బిపి, ఈసీజీ, 2డి ఎకో టెస్టులు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు ఉచితంగా మందులు అందించారు. మరింత వైద్యం చేయాల్సిన వారిని గుర్తించి వారిని ఆదివారం ఉదయం నాగులపాడు పుట్ట దగ్గర బస్సులు ఏర్పాటు చేసి కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తామని, వైద్యం అనంతరం బస్సుల్లోని తీసుకొస్తామని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షులు గొల్లపూడి సాంబశివరావు, సభ్యులు బండి కామేశ్వరరావు, నంగినేని సింగారావు, పాటిబండ్ల సుబ్బారావు, ఆళ్ల విజయ్, కాటూరి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కె.రత్నగిరి, డాక్టర్ అభిషేక్, డాక్టర్ డానియల్, డాక్టర్ బి.రూప, మేనేజర్ పి.క్రాంతి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే ఉపేక్షించొద్దు

ప్రజాశక్తి-తెనాలి : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పిసి అండ్ పిఎన్డిటి చట్టం (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ యాక్ట్)పై సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధ్యక్షతన సమీక్షించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ నేరమన్నారు. పిసి అండ్ పిఎన్‌డిటి చట్టంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డివిజన్లో మొత్తంగా 66 స్కాన్ సెంటర్లు ఉన్నాయని, వాటిపై నిఘా ఉంచాలని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ జరిగినట్లు రుజువైతే వారిని ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ఇ.అన్నపూర్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంటుందని, చట్టంపై స్కాన్ సెంటర్ల నిర్వాహకులకు అవగాహన కల్పించామని, ఆయా సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాలని చెప్పారు. సమావేశంలో డి3 శారద సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ డి.శారద, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ కుమార్, డిఎస్‌పి ఎం.రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి, సభ్యులు పాల్గొన్నారు.

కూటమి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు : కూటమి బలోపేతానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక 19వ వార్డు వీవర్స్ కాలనీలో 18, 19 వార్డుల టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కార్యాలయాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. 19 వార్డులో టిడిపి జెండాను ఆవిష్కరించారు. నాయకులు ఎ.వీరబాబు, జె.కోటేశ్వరరావు, నారాయణరావు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రానికి స్థలం ఎక్కడైనా ఇస్తాం

ఆచార్య ఎన్‌జి రంగ వర్సిటీ అధికారులతో పల్నాడు కలెక్టర్, ఎంపీ సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసిఎఆర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. నిబంధనల ప్రకారం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అనువుగా ఉండే 50 ఎకరాలను జిల్లాలో ఎక్కడైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించే సంస్థలు జిల్లా నలుదిశలా ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీ కోరారు. ఇప్పటికే నకరికల్లు మండలంలో నెలకొల్పిన ఇండో - ఇజ్రాయెల్ వ్యవసాయ ప్రాజెక్టుకు కృషి విజ్ఞాన కేంద్రం తోడైతే రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగ్గా అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ప్రమీలరాణి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కాంతారావు పాల్గొన్నారు.


డిగ్రీలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కళ్లం విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం మొట్టమొదటి సారిగా స్వయంప్రతిపత్తి హోదాలో 2024వ విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియు కాకినాడ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని 2024వ విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసిన 700 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాను ప్రదానం చేశారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కళాశాల స్థాపించిన 11 ఏళ్లలో ప్రముఖ విద్యా ప్రమాణాలు కలిగిన ఎన్‌బిఎ, నాక్-ఎ గ్రేడ్ గుర్తింపు, స్వయం ప్రతిపత్తిని సాధించడంతో పాటు 2024వ విద్యా సంవత్సరంలో స్నాతకోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బియస్‌బి రెడ్డి చెప్పారు. డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ డిగ్రీలు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, డిగ్రీ పొందడంతో పాటు ఉద్యోగ అవకాశాలు దక్కటం గొప్పతనం అన్నారు. సమాజంలో మంచి పౌరుడిగా దేశ ప్రగతికి బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మొవ్వా ఉమాశంకర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లు, వెంచర్లను తొలగిస్తాం

- నగర కమిషనర్ కీర్తి చేకూరి
- నల్లపాడు రోడ్డులోని ఆదర్శ నగర్‌లో హద్దురాళ్ల తొలగింపు


హద్దురాళ్లు తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుండి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసే వెంచర్లు, లేఅవుట్స్‌ని తొలగిస్తామని ప్రజలు కూడా అనుమతి పొందిన వెంచర్లలోనే స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్‌లో సమస్యలు రాకుండా ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధిలోని నల్లపాడు రోడ్డులోని ఆదర్శ నగర్ ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్ హద్దురాళ్లు, మార్కింగ్, రోడ్లను పట్టణ ప్రణాళికాధికారులు తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లేఅవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్‌లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లేఅవుట్స్‌కి వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా తాము వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసే ముందు సదరు వెంచర్ అనుమతులను పరిశీలించుకోవాలని, లేకుంటే రానున్న కాలంలో సమస్యలు వస్తాయని చెప్పారు. అనధికార లేఅవుట్స్‌ని తొలగించడానికి సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళికాధికారులు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారన్నారు. అనధికార లే అవుట్స్ తొలగించడం, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంచర్ల నిర్వాహకులు కూడా జిఎంసి నుండి అనుమతుల మంజూరు సులభతరం చేసినందున అనధికార లేఅవుట్స్ ఏర్పాటు చేసి సమస్యలకు గురికావద్దని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించిన వెంచర్ల యజమానులకు వెంటనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపామన్నారు. కార్యక్రమంలో ఎసిపిలు అజయ్‌కుమార్, టిపిఎస్ సువర్ణకుమార్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించకుంటే స్వాధీనం చేసుకుంటాం

నగరంలోని ఖాళీ స్థలాల వల్ల ప్రజలకు అసౌకర్యం వాటిల్లుతోందని, స్థల యజమానులు ఏడ్రోజుల్లోగా స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోకుంటే ఆయా స్థలాలను జిఎంసి స్వాధీనం చేసుకొని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ స్థలాలు పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయని, వీటిల్లో నుండి పాములు, నీరు నిల్వ ఉండడం వలన దోమలు పెరిగి, దుర్గంధం వ్యాపించి, ప్రజలు అనారోగ్యానికి కారణం అవుతున్నాయని ఎమ్మెల్యే గల్లా మాధవి తమ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు నోటీసుల ద్వారా తెలిపామని, మళ్లీ నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు ఖాళీస్థల యజమానులకు తుది నోటీసులు జారీ చేయాలని ఆదేశించామని తెలిపారు. స్థల యజమానుల వివరాల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి సేకరిస్తామని, వారం రోజుల తర్వాత కూడా స్పందించని స్థల యజమానులకు జిహెచ్‌ఎంసి యాక్ట్ 1955 సెక్షన్ 496, 504, 639, 640, 641 ప్రకారం స్థలాల్లో పిచ్చి మొక్కలను పూర్తి స్థాయిలో తొలగించాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో మట్టితో లెవల్ చేసుకోవాలని లేకుంటే జిఎంసి బోర్డులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

417 మందికి స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్‌కేర్ అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

జిల్లా స్థాయి స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్‌కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు స్పాన్సర్షిప్ కార్యక్రమానికి అర్హులైన 417 మంది లబ్ధిదారులను ఎంపికచేసి, వారికి నెలకు రూ.4 వేల చొప్పున 2023 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు అందజేయటానికి నిర్ణయించారు. అనాధలు, పాక్షిక అనాధలు, హెచ్‌ఐవికి గురైన తల్లిదండ్రుల 18 ఏళ్లలోపు పిల్లలకు గ్రామ స్థాయి నుండి గుర్తించిన సదరు పిల్లలకు రెండేళ్ల వరకూ ప్రతినెలా రూ.4వేలు చొప్పున ఆర్థిక సాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ఎం.ఉమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.విజయ్‌కుమార్, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.ఎ.ప్రమీల, ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్-ఇనిస్టిట్యూషనల్ కేర్) టి.దుర్గాభవాని పాల్గొన్నారు.

31న ఎఎన్‌యు పీజీ సెట్ అర్హత పరీక్ష

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెల్ఫ్ సపోర్ట్ కేటగిరి విభాగంలో 2024-25 విద్యా సంవత్సరానికి భర్తీ చేయనున్న ఎంఎ, ఎంఎస్‌సి, ఎం.కామ్, ఎంఎ జర్నలిజం, ఎంఎ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఎమ్ఎల్ఐఎస్‌సి, ఎంఇడి, ఎంపిఈడి కోర్సులకు ఈనెల 31న అర్హత పరీక్ష నిర్వహిస్తామని అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత శుక్రవారం తెలిపారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోలేని వారు ఈ నెల 30వ తేదీలోగా పీజీ అడ్మిషన్ల కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ www.anu.ac.in సంప్రదించాలని డాక్టర్ అనిత సూచించారు.

అడిగోపుల వెంకటరత్నం మరణానికి రచయితల సంఘం సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు


అడిగోపుల వెంకటరత్నం (ఫైల్)

ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారులు అడిగోపుల వెంకటరత్నం మరణానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవానిదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్.ఎం.సుభాని శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో తుదిశ్వాస విడిచారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆయన, తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రవృత్తిరీత్యా ఐదు దశబ్దాలకుపైగా అలనాటి భారతి పత్రిక నుండి ఈనాటి అనేక పత్రికలలో వామపక్ష భావజాలంతో కూడిన వందలాది అభ్యుదయ కవితలు రచించారు. 1984లో 'సూర్యోదయం' కవితా సంపుటి మొదలుకొని 2024లో 'నిలువెత్తు సంతకం' వరకు 27 కవితా సంపుటాలు, 1995లో 'పురోగతి అంచున' అనే పేరుతో ఒక కథాసంపుటి వెలువరించారు. అడిగోపుల చేసిన కృషికిగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం, గిడుగు తెలుగుభాషా పురస్కారం వంటి పలు పురస్కారాలు పొందారు.

గ్రామాలు.. రోగాలకు ఆవాసాలు..



ప్రజాశక్తి - పొన్నూరు

వర్షాకాలంలో వ్యాపించే రోగాల భయంతో గ్రామీణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నియంత్రించొచ్చని అధికారులు పదేపదే ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్ల వెంట వ్యర్థాలు, అధ్వానంగా డ్రెయినేజీ కాల్వలు, గుంతలమయమై నీరు చేరిన రహదారులు రోగాలకు ఆవాసాలుగా, దోమ వృద్ధి కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. ఇందుకు మండలంలోని కట్టెంపూడి గ్రామం నిదర్శనంగా నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. రహదార్లపై ప్రయాణం ఇబ్బందిగా ఉంటోంది. వర్షం వచ్చినప్పుడైతే రాకపోకలు సాహసంగానే మారుతున్నాయి. రోడ్ల వెంట వ్యర్థాల నుండి వస్తున్న దుర్గంధాన్ని పీలుస్తూనే తిరగాల్సి దుస్థితి. అయినా పారిశుధ్య నిర్వహణపై పంచాయతీలు శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



రోడ్డును ఏడాది క్రితం పగలగొట్టారు

వాక శివకోటేశ్వరరావు, కొణతాల శ్రీదేవి, కట్టెంపూడి.



ప్రధాన రహదారిని ఏడాది క్రిత పగలగొట్టారు. అప్పటి నుండి మళ్లీ నిర్మాణం చేపట్టలేదు. ఈ మార్గంలో వానాకాలంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు నడవాలంటే అవస్థలు పడుతున్నారు. వానలప్పుడు వాహనాల మీద రాకపోకల సందర్భంలో పడేపాట్లు వర్ణనాతీతం

